

కథా కౌముది

# పుష్పక విమానం రవి కొప్పరపు

ఈ సంఘటనలు కొన్ని వేల సంవత్సరాలవి. కాల గర్భంలో కలిసిపోయి, దాని ఛాయలు మన పురాణ ఐతిహాసిక కథలలో కనిపిస్తాయి.

★★★★★★

దాదాపు రెండు వేల సంవత్సారాల క్రితం, అవంతి రాజ్యం, ఉజ్జయిని నగరంలో భద్రభట్టు అనే ధనికుడైన ఒక వర్తకుడుండేవాడు. తన వ్యాపార విషయాల్లో చాలా సునిశితమైన దృష్టి వుండేది. ఏదైనా మంచి లాభదాయకమైన విషయం గమనిస్తే, వెంటనే పట్టేసేవాడు. అందుకే తరగని సంపద వచ్చింది. వరహా ధర్మం చెయ్యడు. ఉజ్జయిని నగర పెద్దలతో, మహరాజులతో మంచి సంభంధాలు ఉండేవి.

అతనికి పుష్ప అని ఒకే కూతురు. సౌందర్యానికి మారు పేరులా ఉంటుంది. పాలరాతి ఛాయ, చక్కగా దిద్దినట్టు వుండే కళ్ళు, చూడడానికి ఒక అద్భుతమైన దేవకన్యలాగా ఉండేది. ఇరవై సంవత్సారలొచ్చేసరికి, చదువుతో పాటు, మంచి లోక జ్ఞానం కూడా నేర్చుకుంది. కాని చదువుకున్నది వల్ల కాబోలు, తండ్రి లాగ కాకుండా, దయా దాక్షిణ్యాలు, ఉపకార బుద్ధి వున్నాయి.

అదే ఊళ్ళో కాశీయప్ప అనే వాస్తుశిల్పికి విశ్వకర్మ అనే కొడుకు వున్నాడు. విశ్వకర్మ చాలా సృజనాత్మక దృష్టి కలవాడు. కొత్త కొత్త గా ఆలో చించి, వాటి తాలూకు నమూనాలు తయారుచేసేవాడు. ఒక సారి ఒక దుర్భిణి తయారు చేసి, దూరపు వస్తువులు దగ్గరగా చూసే అవకాశం కలిపించాడు. ఇంకోసారి, కట్టడాలకి ఉపయోగించే సామాగ్రి తయారు చేసి, అవి వాళ్ళ నాన్నకు చూపించాడు. అవి ఆయనకి ఎంతగానో ఉపయోగపడ్డాయి. కాని ఆయనకు ఇవన్ని అనవసరపు పనులుగా అనిపించాయి. బుద్ధిగా తమకు అచ్చొచ్చిన పని, అన్నం పెట్టే పని చేసుకోకుండా, ఇలాంటి పనులేంటి? అందుకే ఆయన తన కొడుకుని ప్రోత్సాహించలేదు. తెలిసిన వాళ్ళు ఆ అబ్బాయి ఎప్పుడూ ఏదో ఒకటి తయారు చెయ్యడం చూసి, ఒక పిచ్చోడని అనుకునేవాళ్ళు.

ఆ ఊళ్ళో పురుషదత్తుడు అనే వజ్రాలవ్యాపారి కొడుకున్నాడు. పురుషదత్తుడికి చిన్నప్పట్నుంచి ఏది కావాలంటే అది దొరికే అలవాటయ్యింది. దాని మూలంగా, డబ్బుందని అహంకారంతో పాటు, తమకంటే స్థాయి లో తక్కువుండే వాళ్ళంటే అసహ్యం. అతను భద్రబట్టుడి కుమార్తెకి అప్పుడప్పుడు ఖరీదైన బహుమతులు ఇస్తూ వుండేవాడు. భద్రబట్టు కూడా, పురుషదత్తుడు తన కూతురుతో సన్నిహితంగా వుండడం చూసి ఏమీ అనేవాడు కాదు. వజ్రాల వ్యాపారితో బంధుత్వం కలుపుకుంటే తన వ్యాపారానికి కూడా మంచిదే కదా.

పురుషదత్తుడుకీ, విశ్వకర్మకీ ఆ పుష్ప అంటే ఇష్టం. విశ్వకర్మ వాళ్ళ నాన్న తో పాటు భవనాలు, ఇళ్ళు కట్టే పని నేర్చుకున్నాడు. ఒకసారి భద్రభట్టుదుండే భవనానికి ఏదో మరమత్తు పనులు చేస్తూ, పుష్పని చూసి మనసు పారేసుకున్నాడు.

తను మాత్రం ఇద్దరినీ సమానంగా చూసేది. విశ్వకర్మ ఏదో వంకతో పుష్పని అప్పుడప్పుడూ కలుస్తూ వుండే వాడు, తను తయారు చేసిన వాటిని ఆమెకు ఇచ్చేవాడు. కొన్ని సార్లు అవి పని చేసేవి, కొన్ని సార్లు మొరాయించేవి. పనిచెయ్యని వాటిని సరిచెయ్యడానికి అతను పడే అవస్థ చూసి, పుష్ప గల గలా నవ్వేది. కాని కించపరిచేది కాదు. ప్రోత్సాహించేది. అతను చేసేవి కొత్తగా వున్నాయని, ఇంకా చేస్తూ ఉండమని చెప్పేది. ఇంకేముంది? నచ్చినమ్మాయి ఇలాగ ప్రోత్సాహమిస్తే ఎక్కడలేని శక్తి రాదు?

పురుషదత్తుడికి విశ్వకర్మ వేస్తున్న వేషాలు తెలిసింది. ఒకసారి తన మందీ మార్బలం తీసుకెళ్ళి, వాళ్ళ నాన్న ముందే హెచ్చరించాడు. ఇది తెలిసి కాశీయప్ప తన కొడుకుని అతని ముందే తిట్టి, మళ్ళీ ఇలాగ జరగదని మాటిచ్చాడు. ఇంక ముందు ఇలాంటి చెత్త పనులు, ఊరికే కూర్చుని పనికిరానివి తయారుచెయ్యడం ఆపి, తన పనిలో బుద్ధి పెట్టమన్నాడు.

మనసు ఊరుకోదు కదా. పైగా పుష్ప కూడా కాస్త స్నేహంగానే వుంది. విశ్వకర్మ రహస్యంగా కొత్తవి తయారు చెయ్యడం, ఏదో విధంగా కలవడానికి ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. పుష్ప కూడా, ఇతను అందరిలాగా కాకుండా, కొంచెం విభిన్నంగా వుండడం, తనని నవ్వించడం చేస్తూంటే కాస్త మంచి అభిప్రాయం కలిగింది.

కొన్ని రోజుల తరువాత, ఒక సారి తనను కలవమని పుష్ప తాలూకా ఎవరో వచ్చి చెప్పారు విశ్వకర్మకి. ఉజ్జయిని నగరం లోని ఒక వస్త్ర దుకాణం కి రమ్మని కబురు. అతను అక్కడికి వెళ్ళాడు. దుకాణం బయట పుష్ప తన స్నేహితురాళ్ళతో మాట్లాడుతూ వుంది. ఇతను వెళ్ళి, మెల్లగా నసుగుతూ మీరు రమ్మని చెప్పారట అని అడిగాడు. ఆశ్చర్యపోవడం ఆ అమ్మాయి వంతయ్యింది. తనేమీ రమ్మని చెప్పలేదంది. ఈ తికమకేంటో అతనికి అర్థం కాలేదు.

ఇంతలో పురుషదత్తుడు తన మనుషుల్నే కాకుండా, కొంత మంది రాజ భటులని కూడా వెంట తెచ్చాడు. విశ్వకర్మని చూపించి అతన్ని వెతకమన్నాడు. భటులు వెతికితే అతని దగ్గర ఒక వజ్రాల హారం దొరికింది. పుష్ప నమ్మకశ్యం కాని మొహంతో అతన్ని చూసింది. విశ్వకర్మ తనేమీ చెయ్యలేదని ఎంత మొత్తుకున్నా భటులు వినలేదు. అక్కడే పడేసి చావు కొట్టుడు మొదలు పెట్టారు. పురుషదత్తుడు వాళ్ళని ఆగమని, పుష్పతో ఈ హారం నీ కోసమని నేను తెస్తే, వీడు కొట్టేసి నీకిద్దామనుకున్నాడు, నీకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాడు, ఇలాంటి అలగా జనానికి ఇలాంటి బుద్ధులే వస్తాయని నోటికొచ్చినట్టు తిట్టాడు. ఇంకా నమ్మలేని స్థితిలో వుంది పుష్ప..కింద పడి వున్న విశ్వకర్మ దగ్గరకెళ్ళి విషయం అడిగింది. అతని మళ్ళీ తనేమీ చెయ్యలేదని చెప్పాడు. తనకు దగ్గరయ్యే విషయం మటుకు వాస్తవమని, తనని ప్రేమిస్తున్నానని చెప్పాడు. అది విని పురుషదత్తుడు బిగ్గరగా నవ్వి, పది జన్మలెత్తినా తనలాంటి అమ్మాయి అతనికి దక్కదని, ఎవరి స్థాయిలో వాళ్ళు వుండాలని, అసలైనా నీ దగ్గరేముందని, ఎగతాళి చేశాడు.

ఇంతలో ఈ గొడవ విషయం ఎవరో చెప్తే భద్రభట్టు తన కూతురిని వెతుక్కొని వచ్చాడు. పురుషదత్తుడు విషయం చెప్తే, భద్రభట్టు ఉగ్రుడయ్యాడు. తన ఇంటికి పనికి వచ్చి, తన కూతురి మీద ఆశపడడం నచ్చలేదు. విశ్వకర్మని తిట్టి, ముందు ఏదైనా ప్రయోజకమైన పని చెయ్యమని, డబ్బు సంపాదించి, అప్పుడు తనని చూసే స్థాయికి రమ్మని కూతురుని తీసుకెళ్ళాడు. పురుషదత్తుడు భటుల్ని ఈ దొంగ ఇక్కడెందుకని చెప్తే, వాళ్ళు విశ్వకర్మని తీసుకెళ్ళి కారాగారంలో వేసారు.

విషయం తెలిసిన కాశీయప్ప, నానా తంటాలు పడి తన కొడుకుని విడిపిచ్చికొని ఇంటికి తీసుకొచ్చి తిట్టిపోసాడు. పెద్దవాళ్ళతో ఎందుకు పెట్టుకున్నావని, ఆ వజ్రాల హారం నువ్వు దొంగలించలేదని తెలుసని, కాని డబ్బున్న వాళ్ళతో ఎందుకీ తలనొప్పులని, మళ్ళీ ఆ అమ్మాయి వంక చూడొద్దని

చెప్పాడు. తండ్రి వెళ్ళిపోయిన తరువాత, తల్లి వచ్చి దెబ్బలు మీదా వేడి గుడ్డతో వత్తుతూ, ఎందుకురా ఇవన్నీ మనకు, నువ్వేవో తయారుచేసుకుంటున్నావు కదా, ఊరికినే పనికిరానివి తయారుచెయ్యడం కంటే ఏదైనా ఉపయోగపడేది చెయ్యమని ఓదార్చి బట్టలు బయట ఆరెయ్యడానికి వెళ్ళింది.

విశ్వకర్మ బయట మంచం మీద పడుకొని, జరిగిన సంఘటనలన్నీ గుర్తు తెచ్చుకుంటున్నాడు. ఏదైనా కొత్తది తయారు చేసి అందరినీ, ముఖ్యంగా ఆ భద్రభట్టుని, పుష్పని అబ్బురపరచాలి. దాని మూలంగా పేరు ప్రఖ్యాతలే కాకుండా, డబ్బు కూడా సంపాదించాలి. ఇంతవరకూ ఎవ్వరూ ఊహించనిది, అద్భుతమైనది చెయ్యాలి. డబ్బూ, పేరు అత్యవసరం. అప్పుడు ఆ పురుషదత్తుడి మీద కూడ కసి తీర్చుకోవాలి. ఎలా? ఏం చెయ్యాలి?

ఏదో చెయ్యాలని కసి, తపన వున్నా ఏం చెయ్యాలో తోచల..పడుకొని ఆకాశంలోకి చూస్తే పక్షులు ఎగురుతున్నాయి...మనకు కూడా ఎగిరే శక్తి వుంటే బాగుండు. తల తిప్పి పక్కన చూశాడు. తన తల్లి బట్టలు ఆరేస్తోంది, వాటికి దగ్గరగా చక్కెల పొయ్యి మీదా గిన్నెలో ఏదో ఉడుకుతోంది. ఆ పొయ్యి కారణంగా వచ్చే పొగతో బట్టలు పైపైకి లేస్తున్నాయి. విశ్వకర్మ మళ్ళీ ఆకాశంలోని పక్షుల వంక చూశాడు. మళ్ళీ తల తిప్పి ఆ పొగ, బట్టల వంక చూశాడు.

మెదడులో ఒక మెరుపు. ఒక్క క్షణం ఆలోచించాడు. అవును, చెయ్యచ్చు. తనేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో అర్థం అయ్యింది. దిగ్గున లేచి గట్టిగా అరిచి, వాళ్ళమ్మని గట్టిగా హత్తుకున్నాడు. వాళ్ళమ్మ ఆరేసిన పెద్ద కొలత బట్టలు పీకి ఇంట్లోకి పరిగెత్తాడు. ఆవిడ ఉలిక్కిపడి, తన కొడుకు ఇంక పూర్తిగా పిచ్చివాడైపోయాడని అనుకుంది.

ఒక రోజు తరువాత అతననుకున్నది తయారు చేశాడు. ముందు బట్టలన్నీ ఒకదానికొకటి జత చేసి కుట్టి, దాని కింద తాళ్ళు కట్టి, వాటికి ఒక లోహం డబ్బా కట్టాడు. ఆ డబ్బాలో చెక్క పుల్లలు పెట్టి పొగ వచ్చేలా చెశాడు. ఆ పొగ రావడం ద్వారా జత చేసిన బట్టలు ఒక పెద్ద బుడగ లాగ ఉబ్బి పైకి లేచింది. అతను సంతోషంతో చప్పట్లు కొట్టాడు. ఇంక దీనిని పెద్దది చేస్తే తను ఈ గాలి బుడగలో కూర్చుని ఆకాశయానం చెయ్యచ్చు. ప్రపంచంలో ఆకాశయానం చేసిన మొట్టమొదటి మనిషి తనే అవుతాడు. అంతే కాకుండా ఒక చోటు నుంచి మరో చోటుకి త్వరగా కూడా వెళ్ళచ్చు.

నెల రోజులు కష్టపడి ఇంకో పెద్ద గాలి బుడగ తయారు చేశాడు. తెలిసినవాళ్ళందిరికీ ఊరి బయట రమ్మని, సోమవారం ఉదయం ఆకాశయానం చేసే మనిషిని చూడొచ్చని చెప్పాడు. ఎవరూ ఇతన్ని పట్టిచ్చుకోలేదు. ఆ రోజు ఒక పట్టుమని పది మంది కూడా రాలేదు. అయిన సరే విశ్వకర్మ సిద్ధమయ్యాడు. సమయానికి తన పెద్ద గాలి బుడగలో పొగ రాజేస్తే, అది మెల్లగా పైకి వెళ్ళడం మొదలెట్టింది. కింద వున్నవాళ్ళు నోరెళ్ళబెట్టారు. ఆ బుడగ అలా నెమ్మదిగా ఎగురుతూ, చాలా ఎత్తుకు చేరి, గాలి వల్ల చాలా దూరం వెళ్ళి, అయిదు కోసుల (10 మైళ్ళు) దూరంలో వున్న గ్రామం దగ్గర దిగింది. అక్కడి వాళ్ళు ఇదేంటో తెలీక భయంకంపితులయ్యి, దాన్ని తగలబెట్టడానికి వస్తే, విశ్వకర్మ కాళ్ళా వేళ్ళాపడి ఏదో చెప్పి మళ్ళీ ఉజ్జయిని కి వచ్చాడు.

ఈ విషయం దావానలంలా వ్యాపించింది. చివరికి పుష్పకి, భద్రభట్టుకి, పురుషదత్తుడికీ కూడా చేరింది. చివరికి ఉజ్జయిని మహరాజుకి కూడా తెలిసింది. ఆయన కబురంపాడు. తనే స్వయంగా వచ్చి చూస్తానని, మళ్ళీ చెయ్యమని ఆదేశం. విశ్వకర్మకి తననుకొన్న అవకాశం దక్కింది. మహరాజు గారు మెచ్చితే ఇంక తనకు తిరుగుండదు. పుష్పని అడిగే తాహతు కూడ వుంటుంది అప్పుడు.

ఇంకో నెల రోజుల తరువాత ఊరి బయట, ఇసక వేస్తే రాలని జనం మధ్య మహరాజు గారు, ఆయన మందీ మార్బలం ఉన్నారు. పుష్ప, ఆమె తండ్రి భద్రభట్టు, పురుషదత్తుడు కూడా వచ్చారు. ఇంక విశ్వకర్మ బుడగ లోకి ఎక్కుతూ పుష్ప వంక చూశాడు. తన అందమైన చిరునవ్వుతో తలాడించింది. అతను కూడా చిన్నగా నవ్వి ఆమె వైపు చెయ్యి వూపాడు. పురుషదత్తుడు వైపు చూస్తే అతను కూడా నవ్వుతున్నాడు. విశ్వకర్మకి చిత్రం గా అనిపించింది. ఎందుకు నవ్వుతున్నాడు? సరే వెళ్ళే సమయమయ్యింది.

గాలి బుడగ మెల్లగా పైకి లేచింది. హాహాకారాలు జనం లోంచి. అలాంటి దృశ్యం ఎన్నడూ చూడలేదు. బుడగ పైపై కి వెళ్తుంటే విశ్వకర్మ కింద చూస్తూ అందరికీ చెయ్యి ఊపుతున్నాడు. ఇంతలో పెద్ద కుదుపు. కట్టిన తాళ్ళలో ఒకటి ఊడొచ్చింది. తను నిల్చొని వున్న డబ్బా కిందకి వంగింది..దాని మూలంగా అతను జారి అంత ఎత్తు నుండి దాదాపు కిందకు పడిపోయేవాడు. కాని డబ్బా అంచు పట్టుకొని, పైకి పాకాడు. లోపల బుడగ ఎగరడానికి పెట్టిన పొయ్యి కూడా జారుతోంది. అది జారితే మొత్తం బుడగ మంట అంటుకుంటుంది. దాన్ని ఇంకో చేత్తో పట్టుకొని కింద కదలకుండా పట్టాడు.

ఇప్పుడర్థమయ్యింది అతనికి పురుషదత్తుడు ఎందుకు నవ్వుతున్నాడో. లేదు, తను విఫలం కాకూడదు. ఎలాగైనా సరే ఆ గ్రామం దాక వెళ్ళాలి. ఈ పొగ పొయ్యి జరగనంత వరకు పర్వాలేదు. దాన్ని అలానే పట్టుకొని ఒక చేత్తో, ఇంకో చేత్తో బుడగ తాడుని పట్టుకొని వేళ్ళాడుతూ అలా ఆ గ్రామం వచ్చేవరకు ఉన్నాడు.

అక్కడ మహారాజుగారి భటులు అతన్ని మళ్ళీ మహారాజు గారి దగ్గరికి వెనక్కు తీసుకొచ్చారు. జనాలందరూ విశ్వకర్మని చుట్టు ముట్టారు. మహారాజుగారి ఆనందానికి అవధులు లేకపోయింది. అతన్ని విపరీతంగా మెచ్చుకొని, తన మెడలోని హారాల్ని బహుమతులిచ్చి, ఇక నుంచి రాజ్య సభలో ముఖ్య సలహా దారుడిగా ఉండాలని, రాజ్యానికి అవసరమైనప్పుడు ఉపయోగపడే వస్తువులు తయారు చెయ్యాలని చెప్పారు. ఇంత కంటే కావల్సింది ఏముంది?

అందరూ వెళ్ళిన తరువాత, భద్రభట్టు, పుష్ప వచ్చారు. పురుషదత్తుడు ఎక్కడా కనిపించలేదు. భద్రభట్టు మెదడు చురుగ్గా పని చేసింది. ఈ బుడగ ద్వారా తన వ్యాపారం ఇంకా పెంచుకోవచ్చు.. నిజంగా ఆకాశమే హద్దు. పైగా మహారాజుగారి కి అత్యంత ఆంతరంగికుడైయ్యాడు. అవకాశాన్ని ఎలా పట్టాలో వర్తకుడికి బాగా అనుభవం. ఇంతకు ముందు జరిగినవి మరిచిపోవాలని, ఇద్దరికీ ఇష్టమైతే పెళ్ళికి కూడా అభ్యంతరం లేదని చెప్పాడు. పుష్ప అందమైన నవ్వు చూసి, విశ్వకర్మ మాటల్లేకుండా వుండిపోయాడు..

★★★★★★★★★★★★★

ఇద్దరికీ పెళ్ళి జరిగి సంవత్సరమయ్యింది...సంపద, పేరు, మర్యాద అన్నీ వచ్చాయి..

ఒక రోజు తన భవనం బయట వుంటే, తన మామగారు భద్రభట్టు, ఎవరో ముగ్గురు తమ పరివారంతో రావడం కనిపించింది. తన దగ్గరికి వచ్చి "వీళ్ళు ఏదో ద్వీపం నుంచి వచ్చారు. మన భాష రాదు. కాని తెలిసిందేంటంటే నువ్వు చేసిన బుడగ గురించి విని, దాని కోసం వచ్చారు.."

వాళ్ళ వంక చూస్తే వేరే దేశస్థులులా వున్నారు. తనని పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు విశ్వకర్మ. ఎక్కడ నుండి వచ్చారు?"

మామగారు వాళ్ళతో చెప్తే, వాళ్ళు ఏదో చెప్పారు. మామగారు మళ్ళీ మాట్లాడుతూ,

"వీళ్ళు లంక ద్వీపం నుండి వచ్చారట."

"అలాగా, మీకు పుష్పక విమానం కావాలా?"

మామగారు అర్థం కాక చూసారు.

"అదే, మీ కూతురు, నా భార్య అయిన పుష్ప పేరే పెట్టాను నా గాలి బుడగకి. తనే కదా దానికి స్ఫూర్తి"

మామగారు వాళ్ళతో ఏదో చెప్పి, మళ్ళీ అన్నారు.

"ఈయన పేరు కుబేరుడు. వారి అన్నగారు లంక ద్వీపానికి చక్రవర్తట. నీ గాలి...అదే పుష్పక విమానం చక్రవర్తి గారికి కావలట. ఏదో ముఖ్యమైన పని వున్నదట దానితో. కొన్ని మార్పులు చెయ్యాలట."

"అలాగా..ఆ చక్రవర్తి పేరు?"

వాళ్ళతో మాట్లాడి చెప్పారు మామగారు

"రావణ చక్రవర్తి"

★★★★

COMMENTS